క్లుప్తంగా

ఆదిత్యుడ్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ రామారావు



రామారావు దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సిబ్బది

అరసవల్లి: అరసవల్లిసూర్యనారాయణ స్వామి వారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబసమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారికి ఆలయ సిబ్బంది, అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భార్య, మాజీ ఎంపీపీ చామంతి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ తదితరులున్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవో రమేష్‌బాబుకు విరాళాన్ని అందజేస్తున్న సాయికృష్ణ దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి ఆలయంలో అమలౌతున్న నిత్యాన్నదాన పథకానికి శ్రీకాకుళం నగరానికి చెందిన కీర్తి గోవిందరావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆదివారం సాయంత్రం ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తికి అందజేశారు. రూ.లక్ష వరకు విరాళమిచ్చిన దాతలకు ప్రత్యేక పర్వదినాల్లో విశిష్ట దర్శన అవకాశం ఉందని ఆలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ తదితరులున్నారు.

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలౌతున్న నిత్యాన్నదాన పథకానికి నగర వాస్తవ్యులు పాట్నూరు వెంకట సాయికృష్ణ కుటుంబం రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆలయ ఈవో రమేష్‌బాబుకు విరాళ నగదును దాతలు అందజేశారు.

సత్యసాయి భక్తుల సేవలు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సాయిభక్తులు

గార: శ్రీకూర్మంలోని పాతపట్నం అమ్మవారి దేవాలయం ఆవరణను సత్యసాయి భక్తులు ఆదివారం శుభ్రం చేశారు. సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా గార మండల సత్యసాయి యువజన విభాగం సభ్యులు ఆలయంలో పరిశుభ్రతతో పాటు వెలుపల పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో యూత్ కో ఆర్డినేటర్ కె.ఆదినారాయణ, కన్వీనర్ రమేష్, సాయిరాం సేవాదళ్ భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాలత్రిపుర కాలభైరవ స్వామి పీఠం ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. కాలభైరవస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. గణేష్ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన అభిషేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీవన తత్వాన్ని బోధించిన శ్రీకృష్ణుడు

శ్రీకాకుళం కల్చరల్: భగవద్గీత ద్వారా శ్రీకృష్ణ పరమాత్మ జీవన తత్వాన్ని అర్జునునికి చెప్పడం ద్వారా మనకు బోధించాడని వక్త పెంట వాశిష్ట కార్తికేయశర్మ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం శ్రీకృష్ణ లీలా వైభవంపై వక్త ఉపన్యసించారు. బాలకృష్ణుడు లీలలు పూతన సంహారం, తృణావర్త సంహారం, కాళియ మర్దన వంటి ఘట్టాల ద్వారా తత్వభావన తెలిపారు. ముందుగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పి.పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, శరత్‌బాబు, ఎన్. నరసింహమూర్తి, ఈశ్వరరావు, దుర్గారావు, సంగమేశ్వరరావు,తవుడు, బాబూరావు పాల్గొన్నారు.

జిల్లాకు విచ్చేసిన మహారాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్



చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: మహారాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ ఆదివారం జిల్లాకు వచ్చారు. ముఖ్య పుణ్యక్షేత్రాల దర్శనం కోసం వచ్చిన ఆయనను జిల్లా పోలీసు కార్యాలయంలో గల ఉన్నతాధికారుల వసతిగృహంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ప్రత్యేక చట్టం తేవాలి

అత్యవసర సేవలు అందించి ప్రాణాలు కాపాడే డాక్టర్లపై దాడులు, అత్యాచారాలు, హత్యలు ఆందోళన కల్పిస్తున్నాయి. అన్ని రంగాల్లో పనిచేసే మహిళలకు సైతం ఈ సమస్యలు రావచ్చు. దేశంలో ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక చట్టాలు రావాలి.

– డాక్టర్ మాదుగుల ఉషశ్రీ, వైద్యాధికారి, ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఉరి శిక్ష విధించాలి

కలకత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్య చేసిన నిందితులకు ఉరి శిక్ష విధించాలి. అప్పడే అలాంటి వారికి భయం కలుగుతుంది. అటువంటి ఆలోచన చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి.

– రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆనందపురం పీహెచ్‌సీ, జి.సిగడాం మండలం



అన్న క్యాంటీన్ల వద్ద వసతుల లేమి!



పొట్టి శ్రీరాములు కూడలి అన్న క్యాంటిన్ వద్ద మండుటెండలో ప్రజలు

- ఎండా, వానలోనే భోజనాలు
- కడుపు నింపుకునేందుకు పేదల అగచాట్లు
- అరకొరగా భోజనం పెడుతున్నారని గగ్గోలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిరుపేదలు, కార్మికులు, జిల్లా కేంద్రంలో పలు పనుల కోసం వచ్చేవారికి మంచి భోజనం పెట్టాలన్న ఆలోచనతో అన్న క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆశయం మంచిదైనా.. అందుకుతగ్గట్టుగా వసతులు కల్పించకపోవడంతో భోజనం కోసం వస్తున్నవారు అవస్థలు పడుతున్నారు. క్యాంటిన్ భవనాలకు పసుపు రంగులు వేయడానికి, ఫొటోలు పెట్టడానికి, ప్రచార ఆర్భాటానికి డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసేందుకు చూపించే శ్రద్ధ వసతుల కల్పనపై చూపించలేదనే విమర్శలు వస్తున్నాయి. శ్రీకాకుళంలోని పొట్టిశ్రీరాములు కూడలి వద్ద అన్న క్యాంటీన్‌కు రూ. 10 లక్షలు, వైఎస్సార్ (ఏడురోడ్ల జంక్షన్) కూడలి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌కు రూ. 22 లక్షలు ఖర్చుచేశారు. ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు రంగులు, చుట్టూ ప్రహరీ నిర్మించి హడావిడిపై శ్రద్ధ చూపారే తప్ప అన్నం కోసం వచ్చే వారికి తగిన సౌకర్యాలు కల్పించడంపై ఆసక్తి చూపలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాచేసినా ప్రజలకు మాత్రం ఉపయోగంలేకుండా పోతోందని అంటున్నారు. క్యాంటీన్లు రోడ్డుమీద వెళ్లేవారికి కనిపించేలా ఏర్పాటు చేసినప్పటికీ.. ఎండ, వాన నుంచి రక్షణ కల్పించేందుకు షెడ్డులు మాత్రం వేయలేదు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. అన్నం కోసం గంటలకొద్దీ క్యూలైన్లలో నిలబడే వృద్ధులు, అనాథలు, అనారోగ్యంతో ఇబ్బంది పడేవారు ఎండ తీవ్రకు స్పృహకోల్పోయి, వడదెబ్బకు గురవుతున్నారు. వర్షం పడే సమయంలో తడిసిపోయి అన్నాని తినాల్సి వస్తుంది. క్యాంటీన్లలో తూతూ మంత్రంగా టేబుళ్లను ఏర్పాటు చేసినప్పటికీ పదిమందికి కూడా సరిపోవడం లేదు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో మండుటెండల్లో గొడుగులు వేసుకుని క్యూలైన్లలో నిలబడుతున్నారు. వర్షం కురిసిన తడిచిపోయి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్న క్యాంటీన్ల వద్ద ఎండ, వాన నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని భోజనం కోసం వచ్చేవారు కోరుతున్నారు.



ఏడురోడ్ల కూడలి క్యాంటీన్ వద్ద లైన్లలో ఉన్న ప్రజలు



ఎండను భరించలేక టేబుల్ కింద కూర్చొని తింటున్న దృశ్యం

వసతులు కల్పించాలి



అన్న క్యాంటీన్ల వద్ద ఎండ, వాన నుంచి రక్షణకు షెడ్డులు వేస్తే బాగుంటుంది. మధ్యాహ్న సమయంలో తీవ్రంగా ఎండ ఉంటుంది. దీంతో మాలాంటి వాళ్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం కూర్చోడానికి ఆరుబటయ బెంచీలు ఏర్పాటు చేసినా కొంత నయమే.

-బి.గిరిధరరావు, కళింగపట్నం

కుర్చీల కింద కూర్చొని తింటున్నాం



అన్నం దొరుకుతుందో లేదోనని మూడు గంటల పాటు అన్నం కోసం క్యూలైన్లలో నిలబడ్డాను. తీరా అన్నం దొరికాక మండుటెండను తట్టుకోలేక టేబుల్ కింద కూర్చొని తిన్నా. రూ. లక్షలు ఖర్చుచేసినా ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

– రావాడ సింహాచలం, పెద్దకొంగరాం

గొడుగులు వేసుకోవాల్సి వస్తుంది



ఆకలి తీర్చుకోవడానికి గంటల కొద్దీ క్యూలైన్లలో ఉండాల్సి వస్తోంది. ఎండను తట్టుకోలేక గొడుగులు వేసుకుంటున్నాం. ఆరోగ్యం సరిగా లేక ఎక్కడ స్పృహ కోల్పోతానేమోనని భయంగా ఉంది. ఎండ నుంచి రక్షణ కల్పించాలి.

– డి.తిరుపతిస్వామి, ఒప్పంగి

చర్యలు చేపడతాం

అన్న క్యాంటీన్లకు రంగులు వేసి సౌకర్యాలు కల్పించేలా తయారు చేశాం. ప్రజల ఇబ్బందులను బట్టి ఎండ, వాన నుంచి రక్షణ కల్పించేందుకు తగిన చర్యలు చేపడతాం. ప్రజల ఇబ్బందులు తమ దృష్టికి రాలేదు. మరిన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

–చల్ల ఓబులేసు, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

విజృంభిస్తున్న విష జ్వరాలు

- గ్రామాల్లో దర్శనమిస్తున్న చెత్త కుప్పలు
- వృద్ధి చెందుతున్న దోమలు, ఈగలు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



ఎచ్చెర్ల గ్రామ సమీపంలో అపారిశుధ్యం



కేశవరావుపేటలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగునీరు విధుల్లో ప్రవహిస్తోంది. గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని జి.సిగడాంలో మెట్టవలసలో ఇటీవల డయేరియా ఆందోళన కలిగించింది. ఈ మండలంలో జాడ, గడ్డకంచరాం, మెట్టవలస వంటి ప్రాంతాల్లో అపారిశుధ్యం సమస్యగా మారింది. జ్వరాలతో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రణస్థలం మండలంలో ప్రధానంగా జేఆర్‌పురం, వెంకటేశ్వర కాలనీల్లో అపారిశుధ్యం నెలకొంది. మండలంలో జీరుపాలెం, కొండములగాం, కోష్ట వంటి ప్రాంతాల్లో జ్వరాలతో ఎక్కువ మంది బాధపడుతున్నారు. లావేరు మండలంలో మురపాక, బుడుమూరు, అదపాక వంటి ప్రాంతాల్లో అపారిశుధ్యం సమస్యగా మారింది. ఈ గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఎచ్చెర్లలో ఎచ్చెర్ల, చిలకపాలెం, కొయ్యాం, డి.మత్స్యలేశం, ధర్మవరం తదితర గ్రామాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాల్లో డెంగీ కేసులు ఉన్నాయి. శ్రీకాకుళం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ బాధితులు ప్రదక్షణలు చేస్తున్నారు. జ్వరాలతో ప్లేట్ లెట్స్ పడిపోతున్నాయి.

మురుగునీటితో అవస్థలు

గార: తీర ప్రాంతంలోని ఇళ్ల ముందటే మురుగు నీరు నిలిచి ఉండిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బందరువానిపేట గ్రామంలో ఎక్కడికక్కడే నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. మధ్యవీధిలో మరీ దారుణంగా ఉంటుంది. దీనివలన దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మండలంలోని పలు పంచాయతీల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అధికారులు పారిశుధ్యం చర్యలు చేపట్టాలని, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జేఆర్‌పురంలో రోడ్డుపై వేసిన ప్రైవేట్ ఆస్పత్రుల వ్యర్థాలు



గార: బందరువానిపేటలో ఇళ్ల వద్దనే నిలిచిన మురుగునీరు

నేత్రదానంతో వెలుగులు



నేత్రదాన పక్షోత్సవాల బ్యానర్ చూపుతున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు బొడ్డేపల్లి అనురాధ అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'కంటి ఆరోగ్యం నేత్రదానం'పై అవగాహన సదస్సు జరిగింది. ప్రతి ఒక్కరూ కళ్లను రక్షించుకోవాలని వైద్యులు సూచించారు. ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో మరణానంతరం వారి నేత్రాలు దానం చేయటం సంప్రదాయంగా చేసుకోవాలన్నారు. రోటరీ ప్రతినిధులకు కంటి ఆరోగ్యం, నేత్రదానంపై అవగాహన కల్పించారు. సదస్సు అనంతరం 25 మంది రోటరీ ప్రతినిధులు నేత్రదానానికి అంగీకరించి ప్రతిజ్ఞ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బమ్మిడి సందీప్, ఎమర్జెన్సీ వైద్యనిపుణులు డాక్టర్ వారణాసి సందీప్, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముని శ్రీనివాసరావు, దూసి సంతోష్‌కుమార్, ప్రతినిధులు అన్నెపు అనంతరావు, దేవరశెట్టి శివశంకర్, బరాటం శ్రీనివాస, పసగడ సూర్య, ధర్మాన ధర్మారావు ఉన్నారు.

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తా..



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

రణస్థలం: తన తండ్రి కింజరాపు ఎర్రన్నాయుడు జ్ఞాపకార్థం ఉత్తరాంధ్రలోనే అత్యుత్తమైన డిజిటల్ లైబ్రరీని రణస్థలంలో ఏర్పాటు చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని జే.ఆర్.పురం హైస్కూల్‌కు చెందిన ఆరే మావ టీమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణస్థలం మండలంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం జే.ఆర్.పురంలో జనసేన నాయకుడు గొర్లె సూర్య 242 రోజులుగా పేదలకు ఉచితంగా నిత్య అన్నదానం చేయడంతో ఆయనను అభినందించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి పెద్దపీట

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేసి, క్రీడాకారులకు అండగా ఉంటామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం డీఈవో కార్యాలయ సమీపంలో ఆర్ఎంఎస్ఏ పరిధిలో ఉన్న భవనాన్ని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయానికి కేటాయించారు. ఈ భవనాన్ని పీడీ, పీఈటీలు తమ సొంత డబ్బులు రూ.7 లక్షల వరకు ఖర్చుచేసి నూతన హంగులతో తీర్చిదిద్దారు. ఈ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి కేంద్రమంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ భవనంపై క్రీడాకారులు విశ్రాంతి తీసుకునేందుకు పెద్ద హాల్ నిర్మితం చేసేందుకు తన ఎంపీ ల్యాడ్ నుంచి నిధులు కేటాయిస్తానని చెప్పారు. ఆరు నెలల్లో నూతనంగా భవనాన్ని నిర్మించి అందజేస్తానని హామీనిచ్చారు. జిల్లాలో నియోజకవర్గానికి నాలుగైదేసి సువిశాలమైన క్రీడామైదానాలున్న పాఠశాల ప్రాంగణాలను గుర్తించి తనకు నివేదిక ఇస్తే వాటిని క్రీడలకు ఉపయుక్తంగా తీర్చిదిద్దేందుకు నిధులను కేటాయిస్తానన్నారు. శ్రీకాకుళం జిల్లాలో అన్ని క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాలని, అందుకు అవసరమయ్యే నిధుల కేటాయింపును తానే చూసుకుంటానని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. క్రీడలతోనే మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతోందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులను ఆటల పట్ల ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పాఠశాల విద్య స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో భాగంగా ఉత్తమ క్రీడా ఫలితాలు సాధించిన ఐదు పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలను ఘనంగా సత్కరించి, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ ఆర్.విజయకుమారి, పి.సుందరరావు మాస్టారు, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, దాసునాయుడు, ఆరవలి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉప విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో కేంద్రమంత్రి, ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు.

ప్రేమామృతాన్ని పంచిన మెహెర్‌బాబా



ప్రసంగిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: కుల, మత, వర్ణ, వర్గ భేద భావాలతో కుమిలి పోతున్న మానవ సమానత్వాన్ని, విశ్వమానవ సోదరత్వాన్ని, తన అవతార కార్యక్రమంలో నిరూపించి, దివ్య ప్రేమామృతాన్ని మెహెర్‌బాబా పంచారని వక్తలు అన్నారు. పట్టణంలోని కత్తెర వీధిలో ఉన్న అవతార్ మెహెర్‌బాబా కేంద్రం 63వ వార్షికోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సహవాస్ జరిగింది. ఈసందర్భంగా పలువురు బాబా సందేశాన్ని వినిపించారు. విజయవాడకు చెందిన బాబా ప్రేమికురాలు కె.సత్యవతి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, జిల్లా కమిటీ సభ్యులు పి.వి.రంగప్రసాదరావు, ఆనంద్‌కుమార్, వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మీయ హిందూ సమ్మేళనం



కొయ్యాంలో ప్రత్యేక భజన కార్యక్రమం

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం రామాలయంలో విశ్వహిందూ పరిషత్ షష్ట్యబ్ది మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆత్మీయ హిందూ సమ్మేళనం నిర్వహించారు. శ్రీరామ భజన బృందం ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా వీహెచ్‌పీ వార్షికోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం తోటపాలెం కూడలి వద్ద ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతోనే విజ్ఞానం సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కల్చరల్: ఉపాధ్యాయులతోనే విద్యార్థులకు విజ్ఞానం సాధ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక పీఎన్‌కాలనీలోని ఓ కార్యాలయం వద్ద ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ పరిచయ కార్యక్రమం ఆదివారం జరిగింది. మన గమ్యానికి దారి చూపేది గురువే అన్నారు. కార్యక్రమంలో బుడుమూరు శ్రీరామమూర్తి, కొండపల్లి రామారావు, అందవరపు సంతోష్, అందవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథ మందిరంలో శ్రీకృష్ణుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నాగావళినది పొన్నాడ బ్రిడ్జి వద్ద ఉన్న శ్రీకృష్ణ (ఇస్కాన్) జగన్నాథ మందిరంలో ఆదివారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలలో ఇస్కాన్ ప్రతినిధి లక్ష్మీపతి గౌర్‌దాస్ శ్రీకృష్ణ లీలపై ప్రవచనం చేశారు. అలాగే భజనలు, కీర్తన కోలాటం శ్రీకాంత్ శిష్యబృందంతో భరతనాట్య ప్రదర్శన జరిగాయి. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాంత్ బృందం నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బ్యాంకర్స్‌కాలనీలోని ఓ ప్రవేటు పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోపికలు, రాధ, శ్రీకృష్ణుడి వేషధారణలతో పిల్లలు ఆకట్టుకున్నారు.



శ్రీకాకుళం న్యూకాలనీ: కృష్ణాష్టమి విశిష్టతను వివరిస్తున్న స్కూల్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్

సీతంపేట యూపీ పాఠశాలలో..

జి.సిగడాం: శ్రీకృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా మండలంలోని సీతంపేట యూపీ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిత్తిరి జగదేశ్వరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జి.సిగడాం: కోలాటం ఆడుతున్న చిన్నారులు



జి.సిగడాం: చెట్టు ఎక్కిన కృష్ణుడు